సెక్షన్ 80సీ.. ఇక క్లాజ్ 123

కొత్త ఆదాయ పన్ను బిల్లులో మార్పు • సెక్షన్లన్నీ క్లాజులుగా రూపాంతరం

అవగాహన లేకపోతే ట్యాక్స్‌పేయర్స్‌కు నష్టమే • సరళతరం చేస్తామని సంక్లిష్టం చేశారన్న విమర్శలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలో సెక్షన్ 80సీ తెలియని ట్యాక్స్ పేయర్స్ ఉండరంటే అతిశయోక్తి కాదు. నిజానికి ఇదొక్కటే కాదు.. చాలా పాపులర్ సెక్షన్లు పన్ను చెల్లింపుదారులు, ఐటీ రిటర్న్స్ దాఖలు చేసేవారి నోళ్లలో నానుతాయంటే ఎంతమాత్రం ఆశ్చర్యపోనవసరం లేదు. దాదాపు ఆరున్నర దశాబ్దాలుగా వాటికి అంతలా అలవాటు పడిపోయాం మరి. అయితే ఇకపై వీరందరికీ కొత్తగా చిక్కులు వచ్చిపడబోతున్నాయి. అవును.. నూతన ఆదాయ పన్ను బిల్లులో ఇప్పటిదాకా ఉన్న సీన్ అంతా మారిపోయింది. సెక్షన్ 80సీని క్లాజ్ 123గా మార్చారు. ఇదేకాదు.. ప్రస్తుత ఐటీ చట్టంలో సెక్షన్లుగా ఉన్నవన్నీ కొత్త చట్టంలో క్లాజుల రూపందాల్చాయి. గురువారం ఆదాయ పన్ను బిల్లు 2025ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న ఈ కొత్త చట్టం.. ప్రస్తుత ఆదాయ పన్ను చట్టం 1961 కంటే సరళతరంగా ఉంటుందన్నారు. అయితే ఆదాయం, పొదుపు, వ్యయాలకు సంబంధించి పన్ను మినహాయింపులు, రిబేట్లు, క్యాపిటల్ గెయిన్స్ తదితరాలు వర్తించే సెక్షన్లను మార్చడం వల్ల గందరగోళం నెలకొందన్న విమర్శలు ఇప్పుడు గట్టిగా వినిపిస్తుండటం గమనార్హం.

ఇదీ సంగతి..

దేశంలో ఉన్న వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారులందర్నీ కొత్త ఐటీ విధానంలోకే తీసుకురావాలన్న లక్ష్యంతో మోదీ సర్కారు ముందుకెళ్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే గత కొన్నేండ్లుగా ప్రతీ బడ్జెట్‌లో కొత్త ఆదాయ పన్ను విధానాన్నే సవరించి మరింత ఆకర్షణీయంగా మారుస్తున్నారు. 2020 నుంచి పాత ఐటీ విధానం జోలికే వెళ్లట్లేదు మరి. ఇటీవలి బడ్జెట్‌లోనూ ఇదే జరిగింది. ఈ క్రమంలో కొత్త ఆదాయ పన్ను బిల్లు సైతం పాత ఆదాయ పన్ను విధానాన్ని ఎంచుకునేవారిని తికమకపెట్టేలా ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందరికీ తెలిసిన సెక్షన్లను తీసేసి, క్లాజులుగా మార్చడం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కొత్త ఐటీ విధానంలో సెక్షన్లతో పనిలేదన్న విషయం తెలిసిందే. వార్షిక ఆదాయం రూ.12 లక్షలు, స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేలు కలిపి రూ.12.75 లక్షలదాకా ఎవరికీ పన్నుండదు. అది దాటితే శ్లాబులవారీగా అందరికీ ఒకేలా పన్నులుంటాయి. ఎలాంటి మినహాయింపులకు తావుండదు. కానీ పాత ఐటీ విధానంలో రకరకాల సెక్షన్ల కింద పీపీఎఫ్, ఎన్ఎస్‌సీ, ఎఫ్‌డీలు, ఈఎల్ఎస్ఎస్ వంటి సేవింగ్స్-పెట్టుబడులతోపాటు హెచ్ఆర్ఏ, బీమా ప్రీమియంలు, విద్య-గృహ రుణం వడ్డీ చెల్లింపులపై పన్ను మినహాయింపులకు వీలున్నది. సీనియర్ సిటిజన్లు, సూపర్ సీనియర్ సిటిజన్లకు మరిన్ని ప్రయోజనాలు వర్తిస్తాయి కూడా. ఇక ఐటీఆర్‌లు దాఖలు చేసేటప్పుడే చాలామందికి ఆయా సెక్షన్ల కింద గరిష్ఠంగా ఎంతదాకా పన్ను ప్రయోజనాన్ని అందుకోవచ్చో ఓ అవగాహన ఉంటుంది. కానీ కొత్త చట్టంలో ఆ సెక్షన్లన్నీ మాయమైపోతున్నాయి. దీంతో ఈ క్లాజులపై అవగాహన లేకపోతే ట్యాక్స్‌పేయర్స్‌కు నష్టమేనన్న ఆందోళనలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. ట్యాక్స్ ఎక్స్‌పర్ట్స్‌ను సంప్రదించి ఐటీఆర్‌లను దాఖలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది.

కొత్త ఆదాయ పన్ను బిల్లు 2025లో క్లాజులుగా మారిన కొన్ని సెక్షన్లను పరిశీలిస్తే..

ప్రస్తుత చట్టంలో	కొత్త చట్టంలో
సెక్షన్ 80సీ	క్లాజ్ 123
సెక్షన్ 80డీ	క్లాజ్ 126
సెక్షన్ 80ఈ	క్లాజ్ 129
సెక్షన్ 80జీ	క్లాజ్ 133
సెక్షన్ 87ఏ	క్లాజ్ 157
సెక్షన్ 54	క్లాజ్ 82
సెక్షన్ 54ఈసీ	క్లాజ్ 85
సెక్షన్ 70	క్లాజ్ 108
సెక్షన్ 71	క్లాజ్ 109

చాలా సంక్లిష్టం: మనీష్ తివారీ

కొత్త ఆదాయ పన్ను బిల్లు చాలా సంక్లిష్టంగా ఉన్నదని కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ విమర్శించారు. పాత చట్టాన్ని సరళతరం చేస్తామన్న పేరుతో ఇంకా సంక్లిష్టం చేశారని దుయ్యబట్టారు. పాత చట్టంలో 296 సెక్షన్లే ఉన్నాయని, కొత్తదాంట్లో 500లకుపైగా ఉన్నాయని గుర్తుచేశారు. షెడ్యూళ్లను కూడా 5 నుంచి 14కు పెంచారని అప్పుడు ఇది ఏ రకంగా సరళతరమో అర్థం కావడం లేదని మండిపడ్డారు.

ఆసియాలో అంబానీయే టాప్

సంపన్న కుటుంబాల్లో రూ.7.85 లక్షల కోట్లతో అగ్రస్థానం

టాప్-20లో 6 భారతీయ ఫ్యామిలీలు • బ్లూంబర్గ్ తాజా జాబితా వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: నేడు ప్రపంచ వ్యాప్తంగా భారతీయులు ప్రాముఖ్యతను కలిగి ఉంటున్నారు. ఇందుకు నైపుణ్యమొక్కటే కాదు.. భారతీయుల వ్యాపార చతురత, సామర్థ్యాలు కూడా కారణమే. ఆసియా దేశాల్లోని టాప్-20 సంపన్న కుటుంబాలకు సంబంధించి బ్లూంబర్గ్ విడుదల చేసిన తాజా జాబితానే ఇందుకు నిదర్శనం. ఇందులో భారత్‌కు చెందిన ఆరు కుటుంబాలున్నాయి మరి. టాప్-10లో నాలుగుంటే.. ముందటి స్థానం కూడా మనదే.

అంబానీకే అగ్రస్థానం

ధీరూభాయ్ అంబానీ వారసుల్లో ఒకరిగా వచ్చిన ముకేశ్ అంబానీ.. ప్రస్తుత భారతీయ వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ఎంతటి ప్రభావవంతమైన పాత్ర పోషిస్తున్నారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పటికే చమురు, గ్యాస్, రిటైల్, టెలికం, బ్రాడ్‌బాండ్, జ్యుయెలరీ తదితర రంగాల్లో తనదైన ముద్ర వేశారు. తన వారసులనూ ఇండస్ట్రీకి పరిచయం చేశారు. ఈ క్రమంలోనే అంబానీ కుటుంబ సంపద విలువ అత్యధికంగా రూ.7.85 లక్షల కోట్లు (90.5 బిలియన్ డాలర్లు)గా ఉన్నట్టు బ్లూంబర్గ్ తెలిపింది.

తర్వాతి స్థానాల్లో..

బ్లూంబర్గ్ ఆసియా సంపన్న కుటుంబాల జాబితాలో భారత్‌కు చెందినవారిలో ముకేశ్ అంబానీ ఫ్యామిలీయే కాకుండా.. మిస్త్రీ, జిందాల్, బిర్లా, బజాజ్, హిందుజా కుటుంబాలు కూడా ఉన్నాయి. ఇందులో రూ.3.25 లక్షల కోట్ల (37.5 బిలియన్ డాలర్లు)తో మిస్త్రీలు నాల్గో స్థానంలో, రూ.2.43 లక్షల కోట్ల (28.1 బిలియన్ డాలర్లు)తో జిందాల్ ఏడో స్థానంలో, రూ.1.99 లక్షల కోట్ల (23 బిలియన్ డాలర్లు)తో బిర్లా కుటుంబం తొమ్మిదో స్థానంలో ఉన్నాయి.

ఎర్టిగా మరింత ప్రియం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: మారుతి మరో మాడల్ ధరను పెంచేసింది. మల్టీ పర్పస్ వాహనమైన ఎర్టిగా ధరను రూ.15 వేలు పెంచుతున్నట్లు గురువారం ప్రకటించింది. నాలుగు రకాల్లో లభించనున్న ఈ మాడల్ రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అధికంకానున్నది. ఈ కారు ధర రూ.8.84 లక్షల నుంచి రూ.12.43 లక్షల వరకు లభించనున్నది.

భెల్‌కు భారీ ఆర్డర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: భెల్ మరో భారీ ఆర్డర్‌ను చేజిక్కించుకున్నది. పశ్చిమ బెంగాల్‌లోని పురులియా జిల్లాలోని రఘునాథ్‌పూర్ థర్మల్ పవర్ స్టేషన్-2లోభాగంగా ఏర్పాటు చేయతలపెట్టిన రెండు 660 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టులో స్టీమ్ జనరేటరు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ భారీ ప్రాజెక్టు నిర్వహించిన బిడ్డింగ్‌లో భెల్ ఆర్డర్ పొందింది. ఈ ఆర్డర్‌లో భాగంగా సంస్థ డిజైనింగ్, ఇంజినీరింగ్, తయారీ, సరఫరా, టెస్టింగ్, స్టీమ్ జనరేటర్ కమిషన్, నిర్మాణాత్మక వర్క్ చేయాల్సి ఉంటుందని పేర్కొంది.

మైక్రోసాఫ్ట్ నూతన క్యాంపస్ ప్రారంభం

భవిష్యత్తులో మరో 15 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్న సంస్థ

హైదరాబాద్, ఫిబ్రవరి 13(నమస్తే తెలంగాణ):అంతర్జాతీయ ఐటీ దిగ్గజం మైక్రోసాఫ్ట్..తాజాగా హైదరాబాద్‌లో నూతన క్యాంపస్‌ను ప్రారంభించింది. గచ్చిబౌలిలో 11 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ అధునాతన భవనాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఈ క్యాంపస్‌తో 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్(ఐడీసీ) మేనేజింగ్ డైరెక్టర్, ప్రెసిడెంట్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ...తెలంగాణలో తమ పెట్టుబడుల కమిట్‌మెంట్‌కు ఈ నూతన క్యాంపస్ నిదర్శనమని, భవిష్యత్తులో మరో రూ.15 వేల కోట్ల పెట్టుబడులు పెట్టే అవకాశం కూడా ఉందన్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో 1.2 లక్షల మందికి పైగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) శిక్షణను అందించేందుకు మూడు కొత్త ప్రోగ్రామ్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు. అడ్వాంటా(ఐ) జీతః తెలంగాణ ప్రోగ్రామ్ పేరుతో మైక్రోసాఫ్ట్ 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ కోర్సును పరిచయం చేసేందుకు ఏఐ ఫౌండేషన్స్ అకాడమీని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. దీంతో దాదాపు 50 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనున్నదన్నారు. ఏఐ-ఇండస్ట్రీ ప్రో పేరుతో మరో కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్రమంతటా 20,000 మంది నిపుణులకు శిక్షణ ఇవ్వనున్నారు.

మైక్రోసాఫ్ట్ నూతన క్యాంపస్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్‌లో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌లో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని స్థాపించబోతున్నది. ఇందులో ఏఐ నాలెడ్జ్ హబ్‌తో పాటు ఏఐ క్లౌడ్-ఆధారిత సేవలు అందించనున్నారు. రాష్ట్రంలో వేలాది మంది ఉద్యోగులకు ఉపయోగపడేలా రీసర్చ్, కేస్ స్టడీస్, ఉత్తమ పరిశోధన పద్ధతులు ఈ సెంటర్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఏఐ అభివృద్ధితో పాటు రాష్ట్రంలో హైపర్ స్కేల్ ఏఐ డాటా సెంటర్లలో తన పెట్టుబడులను రెట్టింపు చేయనున్నట్లు కంపెనీ ప్రకటించింది. దీంతో హైదరాబాద్ ప్రపంచ వ్యాప్తంగా మైక్రోసాఫ్ట్‌కు అతిపెద్ద డాటా హబ్‌గా అవతరించనుంది. ఈ ప్రణాళికలకు సంబంధించి కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నది.

గూగుల్‌తో తెలంగాణ దోస్తీ

రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యాన్ని ఉపయోగించుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం గ్లోబల్ సెర్చింజన్ గూగుల్‌తో ఎంఓయూ కుదుర్చుకున్నది. ప్రధానంగా వ్యవసాయం, పరిపాలన, రవాణా, విద్య తదితర కీలక రంగాల్లో ఏఐ ఆధారిత సేవలు, పరిష్కారాలు అమలు చేయాలని లక్ష్యంగా ఎంచుకున్నది. ఇక ఈ ఒప్పందంలో భాగంగా భవిష్యత్తు అవసరాలకు తగినవిధంగా డిజిటల్ నైపుణ్యాలతో శ్రామిక శక్తిని సన్నద్ధం చేసేందుకు గూగుల్ వ్యూహాత్మక సహకారం అందించనున్నది.

గ్లాండ్‌ఫార్మాపై విదేశీ సంస్థల కన్ను!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: హైదరాబాద్ కేంద్రంగా కార్యాకలాపాలు అందిస్తున్న గ్లాండ్‌ఫార్మాలో మెజార్టీ వాటా కొనుగోలు చేయడానికి విదేశీ కంపెనీలు సిద్ధమవుతున్నాయి. ఈ వాటా కొనుగోలుకు సంబంధించి బ్లాక్‌స్టోన్, బ్రోక్‌ఫిల్డ్, వార్బర్గ్ పింకస్ వంటి దిగ్గజాలు చర్చలు జరుపుతున్నాయి. చైనాకు చెందిన షాంఘై ఫోసన్ ఫార్మాకు గ్లాండ్‌ఫార్మాలో ఉన్న ఈ వాటాను వదిలించుకోవడానికి సిద్ధమైంది. 2017లో 1.2 బిలియన్ డాలర్లతో 74 శాతం వాటా కొనుగోలు చేసిన చైనా సంస్థ.. ఆ తర్వాతి క్రమంలో ఈ వాటాను 51 శాతానికి తగ్గించుకున్నది. ఇదే క్రమంలో మొత్తం వాటాను విక్రయించడానికి సిద్ధమైంది. ప్రస్తుతం కంపెనీ విలువ 3 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ఈ వాటా విక్రయానికి సంబంధించి మోర్గాన్ స్టాన్లీ, యూబీఎస్‌లను ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లుగా నియమించుకున్నది కూడా. డిసెంబర్ త్రైమాసికానికిగాను రూ. 1,384 కోట్ల ఆదాయంపై రూ.205 కోట్ల నికర లాభాన్ని గడించింది.

అప్‌డేటెడ్ షైన్ 125 బైకు

• ప్రారంభ ధర రూ.85 వేలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హోండా మోటర్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా దేశీయ మార్కెట్లోకి అప్‌డేటెడ్ షైన్ 125 మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ బైకు ప్రారంభ ధర రూ.84,493గా నిర్ణయించింది. రెండు రకాల్లో లభించనున్న ఈ బైకు డ్రమ్, డిస్క్ బ్రేకుతో తీర్చిదిద్దింది. 123.94 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకులో ఐదు గేర్లు, ఆటోమేటిక్‌గా స్టార్ట్, స్టాప్ అయే టెక్నాలజీతో తయారు చేసింది.

సూచీలకు ఏడోరోజూ నష్టాలు

ముంబై, ఫిబ్రవరి 13: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఏడోరోజూ నష్టపోయాయి. ప్రారంభంలో భారీగా లాభపడిన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా తీవ్ర ఒడిదుడుకుల మధ్య కొనసాగిన సూచీలకు చివరికి నష్టాల్లోకి జారుకున్నాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 32.11 పాయింట్లు నష్టపోయి 76,138.93 పాయింట్లకు జారుకోగా, నిఫ్టీ 13.85 పాయింట్లు కోల్పోయి 23,031.40 వద్ద నిలిచింది. బ్లూచిప్ సంస్థలైన అదానీ పోర్ట్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్, ఎస్బీఐ, నెస్లే, టైటాన్ షేర్లు నష్టపోగా..సన్‌ఫార్మా, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, కొటక్ మహీంద్రా బ్యాంక్, జొమాటోలు పెరిగాయి. రంగాలవారీగా చూస్తే ఐటీ, ఎఫ్ఎంసీజీ, టెక్, కన్స్యూమర్ డ్యూరబుల్, ఆయిల్ అండ్‌గ్యాస్ రంగ సూచీలు నష్టపోగా..హెల్త్‌కేర్, మెటల్, ఆర్థిక సేవలు, కమోడిటీస్, టెలికం, పవర్, రియల్టీ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.

ట్రిపుల్ ఆర్ పనులు వేగవంతం చేయండి

అధికారులను ఆదేశించిన మంత్రులు భట్టి, కోమటిరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 13(నమస్తే తెలంగాణ): ట్రిపుల్ ఆర్ (రీజినల్ రింగ్ రోడ్డు) నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఆర్అండ్‌బీ శాఖ ప్రీ బడ్జెట్ సమావేశం సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రిపుల్ ఆర్ డీపీఆర్‌తోపాటు 3డీ డిజైన్లు వంటి పనులు వేగవంతం చేయాలని కోరారు. నిధుల కొరత లేదని, ఎంత వేగంగా పనులు చేపడితే అంత వేగంగా నిధులు మంజూరు చేస్తామని అధికారులకు భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్అండ్‌బీ శాఖకు ఉన్న ఆస్తులపై నివేదిక రూపొందించడంతో పాటు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హ్యామ్ (హైబ్రిడ్ యాన్యూటీ హెడ్) రహదారుల నిర్మాణాలను కూడా వేగవంతంగా చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి వచ్చే రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని కోరారు. కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి ఆర్అండ్‌బీ శాఖ విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో ఏవియేషన్ రంగానికి తగిన ప్రోత్సాహం అందిస్తామని మంత్రులు తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీలు రామకృష్ణారావు, వికాస్ రాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గురుకులాల అద్దె బిల్లులు చెల్లిస్తాం

సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల అద్దె భవనాల బిల్లులను వెంటనే చెల్లిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రీ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టళ్లు, గురుకులాల్లో వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో వృత్తివిద్యా కోర్సులు ప్రవేశపెట్టాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, రవాణాశాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణపై గందరగోళం!

• కొన్నిజిల్లాల్లో సిబ్బందికి ట్రైనింగ్
• మరికొన్ని జిల్లాల్లో వాయిదా
• ఈసీ ఆదేశాల్లేక ఆయోమయం

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తేతెలంగాణ): ఎన్నికల సిబ్బంది శిక్షణపై గందరగోళం నెలకొన్నది. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన షెడ్యూల్ మేరకు రిటర్నింగ్ (ఆర్వో), అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ల (ఏఆర్వోల)కు గురువారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో శిక్షణ ఇవ్వాల్సి ఉన్నది. శనివారంలోగా పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు ట్రైనింగ్ పూర్తిచేయాలి. అయితే పంచాయతీ ఎన్నికలు ఇప్పట్లో లేవనే సంకేతాలు అందడంతో కొన్ని జిల్లాల్లో శిక్షణను వాయిదా వేయగా, మరికొన్ని జిల్లాల్లో యథావిధిగా నిర్వహించారు. ఎన్నికల సంఘం, పంచాయతీ రాజ్‌శాఖ అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతోనే ఈ అయోమయం నెలకొన్నది. ఫిబ్రవరి నెలలోనే పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమైనట్టు వార్తలు రావడం, మంత్రులు సైతం పలుమార్లు ప్రకటించడంతో త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందని అంతా భావించారు. ఎన్నికల సంఘం సైతం ఈ దిశగా అన్నిచర్యలు చేపట్టింది. అన్ని జిల్లాలకు బ్యాలెట్ బాక్సులను చేరవేసింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన 3 వారాల్లోగా ఎన్నికల ప్రక్రియను పూర్తిచేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లను నియమించారు. వార్డులవారీగా పోలింగ్‌స్టేషన్లను సైతం గుర్తించారు. ఎన్నికలకు ఇప్పట్లో వెళ్లే ఉద్దేశం లేదనే సంకేతాలను సీఎం, మంత్రులు ఇచ్చారు. ఈ నెల 16 నుంచి 28 వరకు తిరిగి కులగణన సర్వే చేపడతామని, మార్చిలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి కులగణనకు చట్టబద్ధత కల్పించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని కేంద్రానికి సిఫారసు చేయనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు.

అయోమయంలో ఎన్నికల కమిషన్

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు చకచకా ఏర్పాట్లుచేసిన ఎన్నికల కమిషన్ ప్రభుత్వ నిర్ణయంతో అయోమయంలో పడింది. గురువారం ఆర్వోలు, ఏఆర్వోలకు శిక్షణ విషయంలోనూ స్పష్టత లేకుండాపోయింది. దీంతో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం తదితర జిల్లాల్లో నిర్దేశించిన షెడ్యూల్ మేరకు శిక్షణ ఇచ్చారు. మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి, మెదక్ తదితర జిల్లాల్లో వాయిదా వేసినట్టు తెలిసింది. అలాగే ఈ నెల 15న పోలింగ్‌స్టేషన్ల జాబితా ప్రకటిస్తారా? అనే దానిపై సందిగ్ధత నెలకొన్నది.

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 90 మంది

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మూడు ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. కరీంనగర్ (గ్రాడ్యుయేట్, టీచర్), నల్లగొండ టీచర్ నియోజకవర్గాల నుంచి మొత్తం 90 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్టు సీఈవో తెలంగాణ సుదర్శన్‌రెడ్డి గురువారం ప్రకటించారు. కరీంనగర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో 68 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, 12 మంది వెనక్కి తీసుకోగా, 56 మంది బరిలో నిలిచారు. కరీంనగర్ టీచర్ నియోజకవర్గం నుంచి 16 మంది అభ్యర్థులు అర్హత సాధించగా, ఒకరు తమ నామినేషన్ వెనక్కి తీసుకోగా, 15 మంది బరిలో ఉన్నారు. నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి 21 మంది అభ్యర్థులకు అర్హులుగా పరిగణించగా, నామినేషన్ల ఉపసంహరణతో 19 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్టు సీఈవో తెలంగాణ పేర్కొన్నారు.

ఎన్నికల కోసమే ఎల్ఆర్ఎస్ స్టంట్?

• నిధుల కోసం సర్కార్ కొత్త ఎత్తులు
• ఎల్ఆర్ఎస్‌కు 25శాతం రాయితీ ఎర
• మార్చిలోగా పరిష్కారానికి సన్నాహాలు!

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఖాళీ ఖజానాను నింపుకోవడానికి లే అవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్ఆర్ఎస్)పై కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త ఎత్తులు వేస్తున్నట్టు సమాచారం. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ, అనధికారికంగా ఉన్న ప్లాట్లను రెగ్యులర్ చేయడం కోసం తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు వెంటనే పరిష్కారం చూపించాలని అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడిని పెంచింది. మార్చి నాటికి (అంటే ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరు వరకు) ఎల్ఆర్ఎస్ పరిష్కారం పేరుతో దాదాపు రూ.10 వేల కోట్లు వసూలు చేయాలని సర్కారు భావించింది. 25 శాతం రాయితీతో, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద మొత్తం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించడం కోసం కొత్త ఎత్తు వేసింది.ఇందుకు సంబంధించిన జీవో ఒకటి రెండు రోజుల్లో విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్టు అధికారవర్గాల ద్వారా తెలిసింది. ఈ జీవోను వెనువెంటనే అమల్లోకి తీసుకురాడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు. రెగ్యులరైజేషన్ కోసం దాదాపు 25 లక్షల వరకు దరఖాస్తులు రాగా, వాటిలో ఇప్పటివరకు కనీసం 3 లక్షల దరఖాస్తులకు కూడా పరిష్కారం లభించలేదు. ఈ దశలో నిధుల కోసం సర్కారు ఒక మెట్టు దిగింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు రాయితీ ప్రకటించింది. తాము అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌కు ఉచితంగా చేస్తామని గత ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ ఇప్పుడు మాటమార్చి ఎల్ఆర్ఎస్ కోసం ఫీజులు వసూలు చేస్తున్నది. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ నిర్వహణను గాలికొదిలేసిన సర్కారు!

• పేరుకుపోయిన పెండింగ్ బిల్లులు
• ఇష్టారాజ్యంగా అంతర్గత పనులు

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సచివాలయ భవన నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవనంలో కొనసాగుతున్న మరమ్మతులు, వైరింగ్, ఇతర అంతర్గత పనులు సైతం ఇష్టారాజ్యంగా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటి కారణంగానే తాజాగా భవనం ఐదో అంతస్తు నుంచి పెచ్చులూడి కింద పడ్డాయని సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. వాస్తవానికి సచివాలయం నిర్వహణ బాధ్యతను నిర్మాణ సంస్థ పర్యవేక్షిస్తున్నది. ప్రతి మూడు నాలుగు నెలలకు ఒకసారి భవనాన్ని పూర్తిస్థాయిలో పరీక్షించి, ఎక్కడైనా చిన్నచిన్న మరమ్మతులు ఉంటే చేస్తుంటారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బిల్లులు చెల్లించలేదని సమాచారం. దీంతో కొన్నాళ్లుగా నిర్వహణ సంస్థ చేతులెత్తేసినట్టు చెప్పుకొంటున్నారు. మరోవైపు సచివాలయ భవనంలో ఎలాంటి మరమ్మతులు, అంతర్గత పనులు చేపట్టినా నిర్మాణ